క్లుప్తంగా

వరిచేలు నూర్చిన రైతులు పీపీసీ యాప్‌లో పొందుపర్చాలి



కాశీపేటలో కళ్లంలో మాట్లాడుతున్న ఏవో ఎస్. అవినాష్

సీతానగరం: మండలంలో వరిచేలు నూర్పిడిచేసిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోందని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు కాశీపేటలో కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలుకు సివిల్ సప్లయస్ డిపార్ట్‌మెంట్ పీపీసీ యాప్‌ను రూపొందించిందని, ప్రస్తుతం రైతుల కళ్లాల్లో ఉన్న, నూర్చని వరిచేను కుప్పలు, నిల్వ ఉన్న బస్తాలతో ధాన్యం నిల్వల వద్ద రైతులు నిల్చుని ఫొటోలు తీసుకుని పీపీసీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు, ఆర్బీకే టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే అభినందనలు



అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీలో జాతీయ స్థాయిలో నిర్వహించిన డాక్టర్ అంబేడ్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డులను పార్వతీపురం పట్టణ వాసులు అందుకున్నారు. పట్టణానికి చెందిన సొండి గౌరీశంకరరావు, ఉమ్మడి జిల్లా రెల్లి కులా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గండి శరత్ చైతన్య (న్యాయవాది, రెల్లి కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా లీగల్ ఎడ్వైజర్) అవార్డులను అందుకోవడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం అభినందించారు. జిల్లాకు చెందిన వారు అవార్డులు అందుకోవడం అభినందనీయమని వారిని ప్రశంసించారు.

రిజిస్టర్ల నిర్వహణ బాధ్యత హెచ్ఎమ్‌లదే..



రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతి కుమారిని సత్కరిస్తున్న డీఈఓ రమణ

పార్వతీపురం టౌన్: రిజిస్టర్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపైనే ఉందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో డీఈఓ కార్యాలయాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం కవిటిభద్ర కేజీబీవీను సందర్శించారు. పెదబొండపల్లిలో నిర్వహించి జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొన్నారు. పార్వతీపురానికి మొదటిసారిగా వచ్చిన ఆమెను డీఈఓ ఎస్‌డీవీ రమణ, సిబ్బంది సత్కరించారు.

దుర్గమ్మకు సంబర నీరాజనం



మేళతాళాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఘటాలు, ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సంప్రదాయ వస్త్రాలంకరణలో నూతన దంపతులు ఘటాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు దారల్పాడి

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిర్దేశించిన సబ్ ప్లాన్(ఉప ప్రణాళిక)ను ప్రభుత్వం మరో పదేళ్లు పొడిగించడం పట్ల జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. దళిత, గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం పదేళ్ల కాలపరిమితితో ప్రకటించిన గత ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం–2013 జనవరి 23 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈనెల 23తో కాలపరిమితి ముగియడంతో ఆయా వార్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మరో పదేళ్ల గడువు పొడిగించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పులకించిన భక్తజనం

- శంబరలో సందడి
- భక్తితో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న భక్తజనం
- అంగరంగ వైభవంగా సిరిమాను సంబరం



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో, ట్రస్ట్ బోర్డు చైర్మన్



సిరిమాను బండికి పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: శంబర జాతరకు భక్తులు పోటెత్తారు. గత ఏడాదితో పోల్చితే కాస్త రద్దీ తగ్గినా దశాబ్దాలుగా వస్తోన్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొంగు బంగారమైన శంబర పోలమాంబపై వున్న నమ్మకాన్ని, భక్తిని చాటుకునేందుకు భక్తులు శంబర గ్రామానికి తరలివచ్చారు. గోముఖీ నదీ ప్రాంగణంలో కోళ్లు, మేకలను మొక్కులు చెల్లించారు. చీరలను చూపి కొందరు మొక్కులు తీర్చుకోగా, పలువురు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వనంగుడి వద్ద పెదపోలమాంబను దర్శించుకున్న అనంతరం ఆలయం వెనక వున్న వేపచెట్టుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆపై భక్తులు సమీప ప్రాంతంలో వంటావార్పులు నిర్వహించి భోజనాలు చేశారు. భక్తులు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, జీపులలో తరలి రావడంతో ఆయా మార్గాలన్నీ రద్దీగా మారాయి. సమీప గ్రామాల వారు కాలినడకన జాతరకు రావడం కనిపించింది. శంబర గ్రామంలో ఉదయం 11.30 గంటల వరకు భక్తుల రద్దీ సాధారణంగానే కనిపించినా, తరువాత ఊక పోస్తే రాలని విధంగా పరిస్థితి మారింది. భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో సునాయాసంగా అమ్మవారి దర్శనం చేసుకోగలిగారు. దీంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. సిరిమానోత్సం సమయాన కూడా భక్తుల తాకిడి గతంలో కన్నా తక్కువగా వుండడంతో భక్తులు ఆనందోత్సాహాలతో సిరిమానును తాకేందుకు ఉత్సాహం చూపారు. గ్రామంలో గృహాలన్నీ బంధువులు, స్నేహితులు, ఆడపడుచులు, అల్లుళ్లతో సందడిగా మారాయి. శంబర పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ జి.వెంకటరమణ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు దర్శించుకున్నారు. ఈవో వి.రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.



జాతరలో పర్యటిస్తున్న డీఎస్పీ సుభాష్



జాతర పరిశీలిస్తున్న ఆర్డీవో హేమలత



మొక్కుబడి చెల్లిస్తున్న యువతి

అయోడిన్ ఉన్న ఉప్పు వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: అయోడిన్ ఉన్న ఉప్పును వినియోగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మూడవ దశ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ సర్వే బందలుప్పి పీహెచ్‌సీ పరిధి అడ్డాపుశీల హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ జిల్లాలో 30 పీహెచ్‌సీల పరిధిలో పాఠశాలల్లో 6–12 సంవత్సరాల వయసు గల 90 మంది పిల్లలకు థైరాయిడ్ గ్రంధిని తనిఖీ చేసినట్లు చెప్పారు. ఆహారం ద్వారా తీసుకుంటున్న ఉప్పులో అయోడిన్ శాతం పరీక్షిస్తామని తెలిపారు. ప్రతి పది మందిలో ఒకరికి చొప్పున యూరిన్ అయోడిన్ ఎక్స్‌ట్రాక్షన్ కోసం మూత్రం నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం విజయవాడ ఏపీ స్టేట్ ఐడీడీ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. అయోడిన్ శాతం 15–40 పీపీఎం ఉన్న ఉప్పు మాత్రమే వంటలో వాడాలని సూచించారు. ఆయాసం, అధికంగా బరువు పెరగడం లేదా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే థైరాయిడ్ గ్రంధి తనిఖీ చేయించుకోవాలని సూచించారు. దుకాణాల్లో 15 పీపీఎం కంటే తక్కువ ఉండే ఉప్పు అమ్మరాదని, అలా విక్రయించే వారిపై చట్టం ప్రకారం ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డా.ధవళ భాస్కర రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

- ఆర్‌డీఓ హేమలత

పార్వతీపురం:

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గంటలకు ఆర్‌సీఎం (జిల్లా కార్యాలయాల సమూహం) కాంప్లెక్స్‌లో కార్యక్రమం జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె తెలిపారు. ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కళాశాల విద్యార్థుల బృందాలకు ఓటరు దినోత్సవం భవనంపై రంగోలి పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రంగోలిలో పాల్గొనే విద్యార్థి బృందాలు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటింగ్‌లో ఈవీఎం పాత్ర, పోలింగ్ బూత్ తదితర ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ముగ్గులు వేయాలని ఆమె సూచించారు. వేదిక వద్ద సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఓటరు ప్రతిజ్ఞ, ఉత్తమ బూత్ స్థాయి అధికారులకు ప్రశంసాపత్రాల పంపిణీ, యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, ప్రతికుటుంబానికీ నిరంతరం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మనసారా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ఎంపీటీసీ టి.సత్యవతి, సర్పంచ్ టి సత్యవతి,ఉపసర్పంచ్ వెంకటనాయుడు, స్థానిక నాయకులు చప్ప సురేష్, పువ్వలరాము, చప్ప ఉమ, అప్పలనాయుడు, గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాలనీ, పాతలక్ష్మీపురంలలో ఎమ్మెల్యే గడప గడపకు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. అలాగే జగనన్న ప్రభుత్వం ద్వారా పొందుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అందకపోతే అందుకు గలకారణాలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు పొందడానికి అర్హత ఉంటేచాలు అమలు చేయడానికి జననన్న ప్రభుత్వం సిద్ధంగా ఉందని లబ్ధిదారులకు చెప్పారు. అనంతరం జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో త్వరలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాలనీలో నిర్దేశించిన స్థలాల్లో పునాదులు వేసిన లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుని ఇళ్ల పొజిషన్ పట్టాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామంలో సామాజిక పరమైన సమస్యగా ఉన్న కాలువలు, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎంను మళ్లీ ఆశీర్వదించాలి

ప్రతి ఒక్కరికీ ఆసరాగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, నాయకులు ఈశ్వర నారాయణ, వెంకటప్పలనాయుడు, ఆర్వీపార్థసారథి, డి నాగరత్నం, మాజీఎంపీపీ రత్నాకర్, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, వివిధగ్రామాల సర్పంచ్‌లు యు రాధాకృష్ణ, టి.రామారావు, కె.శ్రీనివాసరావు, జి దాసు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని

- డ్వామా పీడీ రామచంద్రరావు

వీరఘట్టం: జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారుడికి ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. మండలంలోని కంబర గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నాగావళి ఎడమ కాలువ 4వ బ్రాంచ్ నుంచి కంబర వరకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలువ గట్టును బాగు చేసేందుకు రూ.3.11 లక్షలతో ఎస్టిమేషన్ వేసినట్లు చెప్పారు. మంగళవారం 166 మంది వేతనదారులు పనికి వచ్చినట్లు ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు జరగాలి



లచ్చయ్యపేట సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ చంద్రమౌళి

సీతానగరం: వివిధ పథకాల నిధులతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వాహకులు చేయాలని పీఆర్ ఏఈ చంద్రమౌళి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన లచ్చయ్యపేట ఎస్సీ కాలనీలో జరిగిన సీసీ రోడ్డుపనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు సచివాలయం, రైతుభరోసా, గ్రామీణ వైద్యకేంద్ర భవనం, గడప గపడకు మన ప్రభుత్వం పథకం నిధులతో జరుగుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేయించాలని స్పష్టం చేశారు. అలాగే నిర్దేశించిన గడువులోగా గ్రామాల్లో సచివాలయ భవనాలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఇంజినీరింగ్ సహాయకులు, కార్యదర్శి మురళి, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

చినభోగిలి మీదుగా శంబరకు 30 బస్సులు



చినభోగిలిలో ఆర్టీసీ సిబ్బంది

సీతానగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా పూజించే శంబర పోలమాంబ జాతరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకునేందుకు పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి చినభోగిలి మీదుగా 30 బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో చినభోగిలి వద్ద ప్రయాణికుల రాకపోకలు క్రమబద్ధీకరించేందుకు ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చినభోగిలి మీదుగా వెళ్తున్న బస్సు సర్వీసులు బొబ్బిలి మండలం దిబ్బగుడ్డి వలస మీదుగా వస్తున్నాయని తెలియజేశారు. అలాగే సీతానగరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో అత్యవసర సేవలందించిడానికి ఉచితవైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

బాలబాలికలు ఇద్దరూ సమానమే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: సమాజంలో బాలబాలికలు ఇద్దరూ సమానమేనని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. బాలికలు జాతీయ సంపద అని, బాలికలు లేని ఇల్లు ఆనందాల హరివిల్లు కాలేదన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రకరకాల అపోహలు, సామాజిక రుగ్మతలను అనుసరించే వారు బాలురకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కుటుంబ బాధ్యతల నిర్వహణలో, వివిధ రంగాలలో రాణించడంలోను బాలికలు ఎవరికీ తీసిపోరన్నారు. ఆధునిక కాలంలో ఉన్నత పదవులు పొందుతూ చక్కని పాలన అందించడంలో మహిళలు అందెవేసి ఉన్నారని, అంతరిక్షం, రక్షణ, పోలీస్ శాఖల్లోను అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శిస్తూ ఔరా అనిపించుకుంటున్నారన్నారు. చదువుల్లో మంచి ప్రతిభ చూపిస్తున్నారని ప్రశంసించారు. బాలికల ఆవశ్యకతను సమాజం గుర్తించాలని, అపోహలు వదిలిపెట్టాలని కోరారు. కొన్ని రాష్ట్రాల్లో బాలబాలికల నిష్పత్తిలో విపరీతమైన వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, డాక్టర్ వినోద్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ విజయ గౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలి



దివ్యను అభినంధిస్తున్న కళాశాల సిబ్బంది

- దివ్యాంగ విదార్థినిని అభినందించిన కళాశాల సిబ్బంది

పార్వతీపురంటౌన్: విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపు చదువుతూ క్రీడలలో ప్రతిభ కనబరచిన బిత్రపాడు గ్రామానికి చెందిన కొప్పర దివ్యను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్ 19 గేమ్స్ పోటీలలో వాలీబాల్ విభాగంలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు దివ్య ఎంపికైనట్లు చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సీఎం కప్ ఆటల పోటీలలో వాలీబాల్ ఆటలో ఉన్నత ప్రతిభ చూపి దివ్య మొదటి స్థానంలో నిలిచిందన్నారు. శ్రీకాకుళంలో జరిగిన అండర్–19 విభాగంలో షాట్‌పుట్ ఈవెంట్‌లో కూడా మూడవ స్థానంలో నిలిచి కొద్ది రోజులలో కడపలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ క్రీడలలో ప్రతిభ చూపుతూ కళాశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులంతా రాణించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

జొన్న చేనులో తెగులుపై జాగ్రత్త పాటించాలి



జీరోటిల్లేజ్ విధానంతో చినబోగిలిలో మొక్కసాగును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



జొన్న పంటలో ఆకులను పరిశీలిస్తున్న ఏఓ ఎస్ అవినాష్



జొన్నపంటలో ఆశించిన కత్తెరపురుగు

సీతానగరం: మండలంలో జీరో టిల్లేజి విధానంతో రైతులు మాగాణి భూముల్లో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించడంతో జాగ్రత్తలు పాటించాలని ఏఓ ఎస్ అవినాష్ సూచించారు. చిన్నభోగిలి గ్రామంలో చుక్క వెంకటనాయుడు పొలంలో జీరోటిల్లేజ్ మొక్కజొన్నను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి మాగాణిలో జీరో టిల్లేజి పద్ధతిలో మండలంలోని 460 ఎకరాల్లో మొక్కజొన్న వేశారని తెలిపారు. జీరో టిల్లేజ్ (దుక్కి దున్నకుండా విత్తనం నాటడం) విధానంలో విత్తడం వల్ల తొలిదశలో (మొక్క రెండు లేదా మూడు ఆకుల దశ) కత్తెర పురుగు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ పురుగు సోకితే అకును విచ్చల విడిగా తిని మొవ్వను కొరికి మొక్కను పూర్తిగా తినేస్తుందని చెప్పారు. దీని నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కత్తెర పురుగుతో నష్టం

- ఏ పంట దశలోనైనా మొక్క అన్ని భాగాలపై కత్తెర పురుగు దాడి చేస్తుంది.
- కత్తెర పురుగు వల్ల 60% వరకు దిగుబడి నష్టాలు ఉంటాయి
- ప్రారంభ పంట దశలోను, మొక్క పెరుగుతున్న కొనను దెబ్బతీస్తుంది
- పురుగులు ఆకులను తిని జీవిస్తాయి, ఇవి దిగుబడిని ప్రభావితం చేస్తాయి.

నివారణ చర్యలు

కత్తెర పురుగు పంటకు ఆశించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో చాలా తక్కువ వ్యవధిలో పంట మొతాన్ని ఆకులు లేని అస్థిపంజరంలా తయారు చేస్తుంది. కత్తెర పురుగు నివారణ కోసం రసాయన మందులను పిచికారీ చేసేప్పుడు ఉదయం, లేదా సాయంత్రం సమయాల్లో చేయడం మంచిది. ఒక లీటర్ నీటిలో 5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా ఒక లీటర్ నీటిలో 3 మీ.లీ స్పెనోశాడ్ కానీ ఇమమెక్టిమ్ బెంజోయేట్ 4 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి కానీ పిచికారీ చేయాలని ఏఓ అవినాష్ సూచించారు.